ఆరంభం ఘనం..!

- నిర్వహణ శూన్యం
- శుద్ధజల కేంద్రాలు ప్రారంభమయ్యేనా..?

నిరుపయోగంగా ఉన్న సుజల స్రవంతి వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కేంద్ర, ప్రభుత్వాలు గత రెండు దశాబ్ద కాలంగా జాతీయ తాగునీటి సరఫరా పథకం కింద ప్రతి గ్రామపంచాయతీలో అన్ని ఆవాస గ్రామాలలో సురక్షిత తాగు నీటిని తగినంత పరిమాణంలో ప్రతి ఇంటికి నిర్ణీత సమయానికి అందేలా పథకాలను రూపొందించింది. అయితే ఈ పథకాల నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు నీరు గారుస్తున్నారు. సిపిడబ్ల్యు పథకం ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్న నీటిని ప్రజలు తాగడం లేదు. సరిగా శుద్ధి చేయని కారణంగా నీటిని తాగితే రోగాల బారిన పడే అవకాశం ఉంది. అందువలన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో శుద్ధజలం అందించే ఉద్దేశంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో 838 ఆర్‌ఓ ప్లాంట్లను సుజల స్రవంతి పథకం పేరుతో ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ సుజల పథకం, ఎంపీ నిధులు, గ్రామపంచాయతీ, ఎమ్మెల్యే నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 211 గ్రామాలకు గాను 423 శుద్ధ జల కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా కోడుమూరు మండలో సుజల స్రవంతి పథకం కింద 24 చోట్ల శుద్ధి జలాలు అందించే ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో మదర్ ప్లాంట్లలో గంటకు పదివేల లీటర్ల నీరు శుద్ధి చేసే యంత్రాలు బిగించారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ఏర్పాటు చేశారు. మండలంలో 16 శుద్ధ జల కేంద్రాలు మూతపడ్డాయి.

గ్రామాల్లో అలంకార ప్రాయంగా: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం పేరుతో ఒక్కో శుద్ధిజల కేంద్రానికి రూ.2.18 లక్షల చొప్పున రూ. 14.25 కోట్ల నిధులను కేటాయించి ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు మాత్రమే పనిచేసిన శుద్ధి జల కేంద్రాలు నిర్వహణ వ్యయం పెరగడంతో కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించలేదన్న కారణంతో ఎలక్ట్రికల్ కరెంటు సరఫరా నిలిపివేయడంతో ప్లాంట్లు మూతపడ్డాయి. ప్రస్తుతం మండలంలో కేవలం 8 ప్లాంట్ మాత్రమే వాటర్ సరఫరా చేస్తున్నాయి. సంవత్సరాలు తరబడి గడుస్తున్నా దాని బాగోగుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సుజల పథకం పేరు మార్చిందే తప్ప పైసా నిధులు విడుదల చేయలేదు. రూ కోట్లు ఖర్చు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.

ఆర్‌ఒ ప్లాంట్లలో పరికరాలు మాయం: ఏళ్ల తరబడి ఆర్‌ఒ ప్లాంట్లు మూత పడడంతో ఇదే అదునుగా భావించి అందులో ఉన్న విలువైన పరికరాలను కాజేశారు అక్రమార్కులు. కనీసం అధికారులైనా అటువైపు చూసిన దాఖలాలు లేవని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్లాంట్లు మూతపడడంతో ప్రజలు సమీప ప్రాంతాల్లోని ప్రయివేట్ నీటి శుద్ధి కేంద్రాల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్లాంట్లు తిరిగి వినియోగంలోకి తీసుకొని రావాలంటే రూ.లక్షలు అవసరమవుతుంది.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించేనా: ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ జల స్రవంతి పథకాన్ని సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే కరువు గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన నీరు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వ లేదా ప్రయివేటు ద్వారా నిర్వహించి సిబ్బందిని నియమిస్తే కొంతమందికి ఉపాధి కూడా కల్పించిన వారవుతారు.

రూ.20 పెట్టి కొంటున్నాం...

- ఓబులేసు, కొండాపురం గ్రామ నివాసి

గ్రామాల్లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు పనిచేయకపోవడంతో విధి లేని పక్షంలో ప్రయివేట్ వాటర్ ప్లాంట్ల నుంచి రూ.20 బాటిల్ పెట్టి కొనుక్కొని మరీ తాగుతున్నాం. శుభకార్యాల సమయంలో తాగునీటి కొరకు రూ.1500 నుంచి రూ.2000 వరకు వెచ్చిస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ప్రభుత్వం తిరిగి స్పందించి వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకొని రావాలి.

నిర్వహణ వ్యయం పెరగడంతో...

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రసాద్

ప్రతి ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పరిధిలో దాదాపు 150 నుంచి 200 కార్డులు తీసుకున్నట్లయితే వాటిని పునః ప్రారంభించే అవకాశం ఉంది. మేము కోడుమూరు బాధ్యతలు చేపట్టిన తర్వాత 4 వాటర్ ప్లాంట్ల నుండి అదనంగా మరో 4 వాటర్ ప్లాంట్లు పని చేసేటట్లు చర్యలు తీసుకున్నాం. ప్రజల నుండి సరైన స్పందన లేనందువలన నిర్వహణ వ్యయం పెరగడంతో మూతపడ్డాయి.

నిర్వహణ వదిలేశారు

- విజయ్, గోరంట్ల గ్రామ నివాసి

వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. నిర్వహణ వదిలివేశారు. కనీసం కొన్ని రోజులు కూడా పనిచేయలేదు. రూ.లక్షల ప్రజాధనం వృధా అవుతుందే తప్ప ఉపయోగం లేదు. వీటిని ప్రారంభించింది టిడిపి ప్రభుత్వమే కాబట్టి మరలా ఇదే ప్రభుత్వం రావడంతో వీటిని పునఃప్రారంభించాలి. ప్రజాధనం వృధా కాకుండా చూడాల్సినబాధ్యత పాలకులకు, అధికారులకు ఉంది.

సిఎం బాబుకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి బాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ముఖ్యమంత్రి బాబుకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా మల్యాల ఎత్తిపోతల పంపింగ్ స్టేషన్ నుంచి రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమానికి వెళ్లేందుకు జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి మధ్యాహ్నం 12.37 నిమిషాలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ బిటి నాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పి విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, జయ నాగేశ్వర రెడ్డి, శ్యామ్‌కుమార్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కురువ సంక్షేమ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర వాల్మీకి సంక్షేమ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పిఎసిఎస్ చైర్మన్ రమణ, ఎపిఎస్ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, మాజీ ఎంపి సంజీవ్ కుమార్, మాజీ ఎంఎల్‌సి ఇక్బాల్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మంత్రాలయం టిడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర, వీరభద్ర గౌడ్, మాది గకార్పొరేషణ్ డైరెక్టర్ ధరూర్ జెమ్స్ ఉన్నారు. తిరిగి ఉమ్మడి జిల్లా పర్యటన ముగించుకొని సాయంత్రం ఐదు గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుండి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

బాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ నాగరాజు



బాబుకు స్వాగతం పలుకుతున్న తిక్కారెడ్డి

పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

- -అలసత్వం వహిస్తే కఠిన చర్యలు - వారంలోగా మెరుగుపరచాలి
- -వాణిజ్య దుకాణాల వద్ద చెత్తకుండీలు తప్పనిసరి
- -4 రోజుల్లో ట్రేడ్ బకాయిలను వసూలు
- -నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని అందించడంలో పర్యవేక్షక సిబ్బందిదే కీలక పాత్ర అని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ అన్నారు. గురువారం నగరపాలక సమావేశ భవనంలో పారిశుధ్య విభాగ పర్యవేక్షక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యం బాగుండాలంటే పారిశుధ్యం సక్రమంగా ఉండాలని, అదేవిధంగా ప్రజల సహకారం కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. వారంలోగా పారిశుధ్యాన్ని గాడిలో పెట్టాలని, పర్యవేక్షక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్యం లోపిస్తే ఇకపై సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారానికి ఒకసారి ప్రతి డ్రెయినేజీ కాలువలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కార్మికులు యూనిఫాం ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాణిజ్య దుకాణాల వద్ద చెత్తకుండీలు తప్పనిసరి ఉండేలా చూడాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నాలుగు రోజుల్లో బకాయిలను పూర్తి స్థాయిలో రాబట్టాలని ఆదేశించారు. మొండి బకాయిదారులపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడొద్దని స్పష్టం చేశారు. త్వరితగతిన బకాయిలను వసూలు చేయడానికి ఆయా సచివాలయంలోని సహచర సెక్రటరీల సహకారం తీసుకోవాలని, బృందంగా ఏర్పడి 4 రోజుల్లో బకాయిల వసూళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్లలో ఆహారం రుచికరంగా ఉండాలి

నగర పరిధిలో ఉన్న ఐదు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఆహారం రుచికరంగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ పి.విశ్వనాథ నిర్వాహకులను ఆదేశించారు. ఆయన సెట్కూరు కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్‌ను, అలాగే కృష్ణ నగర్, కల్లూరు, బిర్లా కాంపౌండ్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని, సమన్వయంతో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

- బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలి
- ప్రజాసంఘాల ఐక్య వేదిక డిమాండ్
- ప్రభుత్వం స్పందించే వరకు కార్యక్రమాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని వెంటనే ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లోవిద్యుత్ భారాలపై ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ అప్ చార్జీలు ఇంధనకు సర్దుబాటు తదితర చార్జీలను రద్దు చేయాలని డిమాడ్ చేశారు. యూనిట్‌కు రూ.0.06 పైసల నుండి రూ.100 పైసలకు పెంచిన విద్యుత్ సుంకాన్ని తగ్గించాలన్నారు. 2024-25 మధ్య వినియో గదారుల నుండి అదనంగా వసూలు చేసిన రూ.2787 కోట్లు వెంటనే తిరిగి చెల్లించాలన్నారు. 2019-25 మధ్య నిధులు రూ.1500 కోట్లను ట్రూడౌన్ ద్వారా బిల్లులలో తగ్గించాలన్నారు. పై కాలంలో వినియోగదారులపై అదనంగా వసూలు చేసే యూనిట్ చార్జీలను రద్దు చేయాలన్నారు. గత సంవత్సరం ప్రభుత్వం ప్రజలపై వేసిన అదనపు విద్యుత్తు భారాలు రూ.15526 కోట్లు రద్దు చేయాలని కోరారు. అదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ప్రమాదకర ప్రమాదకర విద్యుత్ సంస్కరణలు చట్ట సవరణలను నిలిపివేయాలన్నారు. పై డిమాండ్ల సాధనకు రాష్ట్రంలో సుమారు రూ.2 కోట్ల మంది విద్యుత్తు వినియోగదారులు ఐక్యంగా ఉద్యమించాలని ప్రజా సంఘాల వేదిక పిలుపు నిచ్చింది. సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఐఎఫ్‌టియు, జిల్లా నాయకులు తిరుపాలు, ఎఐయుటియు నాయకులు హరీష్, ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, ఎఐడిఎస్‌ఒ మల్లేష్, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు వెంకటస్వామి, సిపిఎం నగర కార్యదర్శులు టి. రాముడు, ఎం.రాజశేఖర్ డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వై.నగేష్‌లు మాట్లాడారు. సిఐటియు నాయకులు సాయిబాబా, విజయ్, నరసింహులు, కెవిపిఎస్ నాయకులు భాస్కర్, యేసు తదితరులు పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయాలు ఈనెల 17 నుండి22 వరకు పట్టణ, మండల సదస్సులు నిర్వహించాలని, ఈనెల 23 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ చేట్టాలని, ఈనెల 30 - ఆగస్టు 4 - వీధి,కాలనీ సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని, ఆగస్టు 5 విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని తీర్మానం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు

విజిలెన్స్ అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్/సి బెళగల్

యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒంగోలు ఎడిఎ రమేష్ బాబు, కడప ఎడిఎ వెంకట నారాయణలు హెచ్చరించారు. కోడుమూరు, సిబెళగల్ రసాయన ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు గురువారం తనిఖీ చేశారు.ఒంగోలు ఎడిఎ బి.రమేష్‌బాబు, కడప విజిలెన్స్ ఆఫీస్ నుండి వచ్చిన సిఐ నాయకుల నారాయణ, కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ శ్రీలక్ష్మీ ఫెర్టిలైజర్స్, శ్రీవెంకటేశ్వర ఫెర్టిలైజర్స్, కోరమాండల్ ఎరువుల దుకా ణాలను తనిఖీ చేశారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పురుగు మం దులు ఫెర్టిలైజర్స్ దుకాణాలను 100శాతం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించా లన్నారు. తనిఖీలో భాగంగా శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్స్‌లో ఈ పాస్ మిషన్‌లో నమోదు చేయకుండా అమ్మకాలు జరిపినందున 17 మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్‌ను (విలువ రూ.21 లక్ష 53 వేలు) నిలిపివేశారు. వాటిని ఈపాస్ మిషన్‌లో సరిచేసిన తర్వాత అమ్మకాలు చేయాలని డీలర్‌కు సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

బాబు మోసాలను ప్రజలకు వివరించండి

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీ దేవమ్మ

క్రిష్ణగిరి- ప్రజాశక్తి

అధికారంలోకి రావడానికి అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి తీరా పదవిలోకి వచ్చిన తరువాత హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. గురువారం క్రిష్ణగిరి వైసిపి కార్యాలయంలో మండల ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి, జడ్‌పిటిసి కెసి సుభాషిని మండల వైసిపి కన్వీనర్ ఆర్ బి వెంకట రాముడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ వైసిపి హాయంలో జగనన్న ఇంటికి అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రస్తుతం చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికి తిరిగి జనాలకి వివరించాలని. కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలకు వైసిపి తరపున ఉద్యమం చేస్తామన్నారు. గత ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు పవన్ కళ్యాణ్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌దాన్ ద్వారా అవయవ దానం

-కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో తొలిసారి ఈ ప్రక్రియ
-గ్రీన్‌ఛానల్ ద్వారా ఆయా ఆస్పత్రులకు అవయవాల తరలింపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో బ్రెయిన్ డెడ్ అయిన 21 సంవత్సరాల మొలక తరుణ్ అవయవాలు జీవన్ దాన్ ఆంధ్రప్రదేశ్ వారి ద్వారా అవయవాలు దానం చేశారని మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియకు ఈనెలలోనే ప్రభుత్వం నుంచి అనుమతి పొందామని తెలిపారు. అవయవ దానానికి సహకరించిన తరుణ్ కుటుంబ సభ్యులకు, కెఎంసి వైద్యులకు, కలెక్టర్, ఎస్‌పిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన తెలిపిన విరాల ప్రకారం....ఈనెల 9న ప్రమాదవశాత్తు మొలక తరుణ్ పాములపాడు దగ్గర యాక్సిడెంట్ కు గురయ్యారు. అక్కడినుండి ఈనెల10న చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడి నుండి ఈనెల14న కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు వచ్చారు. 16న తరుణ్ బ్రెయిన్ డెడ్ అయ్యారు. మహేశ్వర్ రెడ్డి మొలక తరుణ్ తల్లిదండ్రులతో బంధువులతో చర్చించి జీవన్‌దాన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా అవయవ దానం గురించి అవగాహన కల్పించారు. అవయవ దానం ద్వారా ప్రయోజనం పొందే ఇతర పేషంట్ల గురించి చెప్పి అవయవ దానానికి ఒప్పించారు. ఈ దురదష్ట సమయాన వారి కుటుంబ సభ్యులు చూపిన మానవత్వం అభినందనీయం. వారి గొప్ప నిర్ణయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం ఈనెలలోనే మెడికవర్ హాస్పిటల్ జీవన్‌దాన్ లైసెన్స్ పొందింది. మెడికవర్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్లో అవయవ సేకరణ , ఫోరెన్సిక్ ల్యాబ్ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ సుదీర్ నేతృత్వంలో అవయవ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అబ్దుల్ సమద్, డాక్టర్ సిద్దార్థ్ ,న్యూరో డాక్టర్ ప్రవీణ్ ద్వారా అవయవాలు సేకరించి తగిన జాగ్రత్తలు తీసుకొని గ్రీన్ ఛానల్ ద్వారా జీవన్‌దాన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా అనుమతించబడిన హాస్పిటళ్లకు పోలీస్ సహాయంతో హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ ,కర్నూలు జిజిహెచ్, కర్నూలు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అవయవ దానానికి సహకరించిన తల్లిదండ్రులు బంధువులను సత్కరించడం కోసం ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహించి మొలక తరుణ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారిని అభినందించారు. మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం స్టాఫ్‌అందరూ రెడ్ కార్పెట్ పూలమాలతో మొలక తరుణ్‌కు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రింట్ మీడియా ,సోషల్ మీడియా ,డిజిటల్ మీడియా ,హాస్పిటల్ నర్సింగ్ స్టాఫ్ ,అడ్మిన్ స్టాఫ్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి జిజి హెచ్ సూపరిన్‌టెన్‌డెంట్, కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, కర్నూలు మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ డిపార్టుమెంట్, ట్రాఫిక్ పోలీస్ ఫోర్త్ టౌన్ సిఐ, డిఎస్‌పి,ఫెలో డాక్టర్స్, అంబులెన్స్ డ్రైవర్, హైవే అథారిటీస్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

అవయవదానం అంగీకార పత్రం ఇస్తున్న తరుణ్‌కుటుంబ సభ్యులు

తరుణ్ భౌతిక కాయానికి మహేశ్వర్‌రెడ్డి గౌరవ వందనం

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి ?

- ఆస్పత్రి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేసిన బంధువులు
- మాకు ఎలాంటి సంబంధమూ లేదన్న వైద్యులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ :వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందడంతో ఆస్పత్రి అద్దాలు, ఫర్నిచర్‌ను మహిళ బంధువులు ధ్వంసం చేశారు. ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిస్థితి సర్దుమణుగకపోవడంతో మృతురాలి బంధువులను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా పామిడికి చెందిన అనిత (20)కు కర్నూలు నగరం కల్లూరు అర్బన్‌కు చెందిన ప్రసాద్‌తో ఏడాది క్రితం వివాహమైంది. ఈ నెల 15న తీవ్ర జ్వరంతో బాధ పడుతుంటే కర్నూలు శ్రీచక్ర ఆస్పత్రికి అనితను తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయారు. డాక్టర్లు కొన్ని మందులు, ఇంజక్షన్లను రాసి ఇచ్చారు. అయితే ఇంటికి వెళ్లిన తర్వాత అనితకు మళ్లీ జ్వరం రావడంతో వైద్యులు రాసిచ్చిన ఇంజక్షన్‌ను ఆర్‌ఎంపి డాక్టర్‌తో వేయించుకున్నారు. ఇంజక్షన్ వేసిన తర్వాత పరిస్థితి విషమించడంతో ఆమెను హుటా హుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే వై ద్యులు సకాలంలో స్పందించకపోవడంతో అనిత మృతి చెందారని ఆమె బంధువులు ఆరో పిస్తున్నారు. తాము రాసి ఇచ్చిన మందులు, ఇంజక్షన్లను వాడారా? లేక మరేదైనా వాడారా? అనేది తమకు తెలియదని, ఆస్పత్రికి తీసు కువచ్చే లోపు ఆమె మృతి చెందారని, ఆమె మృతికి తమకు ఎలాంటి సం బంధమూ లేదని వైద్యులు అన్నారు. దీంతో కోపోద్రిక్తులైన బంధువులు ఆస్పత్రి అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు ఆస్పత్రి యాజమాన్యంపై, మృతురాలి బంధువులపై కేసులు నమోదు చేశారు. మృతురాలి బంధువులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన అనిత బంధువులు



బందోబస్తు-(ధ్వంసమైన అద్దాలు)

కరపత్రాలు పంచుతూ బాధితుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కరపత్రాలు పంచుతూ..కష్టాలు వింటూ...

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పురస్కరించుకుని కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం దేవమాడలో జరిగిన సుపరిపాలనలో - తొలిఅడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కర్నూలు మండల అధ్యక్షుడుబుర్ర వెంకటేష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఎం నాగరాజు, దేవమాడ గ్రామ సర్పంచి ఈశ్వరయ్య, పంచలింగాల గ్రామ సర్పంచ్ గొల్లకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ నాగ మధు, తెలుగు యువత అధ్యక్షుడు ప్రకాష్, మహిళా సంఘం అధ్యక్షులు బండారుపద్మ, మైనార్టీ నాయకురాలు సయ్యద్ బేగం, నాయకులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'ప్రస్తుత సమాజంలో మహిళ 'అంశంపై నేడు సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళా సంఘం కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత టిసి లక్ష్మమ్మ పదవ వర్ధంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 18న శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్మిక కర్షక భవన్‌లో 'ప్రస్తుత సమాజంలోబి మహిళలు' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్. అలివేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరంలోని మహిళలు ఈ సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సింగిల్ విండో చైర్మన్ గా రమాకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-వెల్దుర్తి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా బొమ్మన రమాకాంత్ రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా నాయకుడు సుబ్బారాయుడు, టిడిపి మండల కన్వీనర్ బలరాంగౌడ్,మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్‌గౌడ్, బోయినపల్లికాంతారెడ్డి, ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా కోదండపాణి, వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. బొమ్మనరమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి కీర్తిశేషులు బొమ్మన శివశంకర్ రెడ్డి 25 సంవత్సరాల పాటు సింగిల్ విండో చైర్మన్ గా రైతులకు సేవ చేశారన్నారు. అదే బాటలో రైతులకు సేవ చేస్తానని తెలిపారు. సొసైటీ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. టపాసులు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాళ్లు తేలి, ముళ్లకంపతో ఉన్న ప్రాజెక్టు

మరమ్మతులకు నోచని 'గురు రాఘవేంద్ర'

- రాళ్లు తేలిన కట్ట - పేరుకుపోయిన ముళ్లకంప

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతులకు సాగునీరందించే ఆశయంతో నిర్మించిన శ్రీగురు రాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. మండలంలోని వగరూరు గ్రామ సమీపంలో ప్రాజెక్టు నిర్మించారు. నేడు ఆనకట్టలకు పగుళ్లు ఏర్పడి రాళ్లు తేలడంతో పాటు చుట్టూ ముళ్లకంపలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంది. ప్రాజెక్టు నిండా నీరు తొణికిసలాడుతున్నాయి. ఒక వైపు రాయలసీమను రతనాల సీమగా చేయాలని తాపత్రయ పడుతున్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గోదావరి జలాలు సముద్రంలో వృథాగా వెళ్తున్నాయని. నదుల అనుసంధానంతో నీరు మళ్లించి రాష్ట్ర రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మాణం కోసం నాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా బీవీ.మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 2004లో ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్టును ప్రారంభించారు. మండలంలోని తిమ్మాపురం, బూదూరు, సూగూరు, చెట్నిహళ్లి, మంచాల గ్రామ రైతుల 2,900 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు నేడు అవసాన దశలో ఉంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుకు గండి పడగా తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే గండ్లు పడి రైతులకు నష్టం జరగకుండా చూడాలని, ప్రభుత్వం స్పందించి గురు రాఘవేంద్ర ప్రాజెక్టుపై నిఘా ఉంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని రైతులు, నాయకులు కోరుతున్నారు.

టిడిపి కార్యకర్తలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రంగమునిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గోనెగండ్ల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచి రంగమునితోపాటు అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వివిధ గ్రామాల టిడిపి కార్యకర్తలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గురై కర్నూలులోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచి రంగమునిని గురువారం పరామర్శించి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కులుమాల గ్రామానికి చెందిన రంగస్వామిని, మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందవరం మండలం పెద్దకొత్తిలి టిడిపి నాయకుడు సత్యారెడ్డి తదితరులను పరామర్శించారు. మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, కులుమాల చాంద్ బాషా, బిసినేపల్లి మల్లా బాష, రాంపురం రఫీక్, సందీప్ నాయుడు, జైపాల్ పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువలకు నీటి విడుదల

ప్రజాశక్తి- దేవనకొండ

పందికోన రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేశారు. గురువారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివా రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామానాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్‌లు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకుని గత నెల రోజులకు పైగా వర్షాలు కురవకపోవడంతో పంటలు వాడుముఖం పట్టడంతో పందికోన రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. నీటిని విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి పత్తికొండ మండల కన్వీనర్ కడవల సుధాకర్, హంద్రీనీవా ఇంజినీర్లు మల్లికార్జున, మౌనిక కన్యాకుమారి, టిడిపి మండల నాయకులు ఉప్పియప్ప, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, నాగరాజు గౌడ్, రాజుగోపాల్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న సాంబశివారెడ్డి

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- వైసిపి ఆధ్వర్యంలో నిరసన
- ఆస్పరి మండలానికి తాగునీరివ్వాలి
- జొహరాపురం దగ్గర ఎస్‌ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఆస్పరి మండలానికి తాగునీరివ్వాలని గురువారం ఆస్పరి చౌరస్తాలో వైసిపి మండల కన్వీనర్ బసవరాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, మహిళలు పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో హాజరయ్యారు. సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి.విరుపాక్షి మాట్లాడారు. ఆస్పరి మండలానికి తాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆలూరు తాలూకాలోని అత్యంత వెనుకబడిన మండలం ఆస్పరి అని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి మూలింటి మారెప్ప ఆదోని మండలం నాగనాథన హళ్లి నుంచి ఆస్పరి వరకు పైప్‌లైన్ వేయడంతో నీరు వస్తున్నాయన్నారు, ఈ పైపు లైనకు ఆదోని మండలంలోని ఆరు గ్రామాలు అక్రమ కలెక్షన్లు తీసుకున్నాయని చెపారు. ఆస్పరికి 15 నుంచి 20 రోజులకోసారి నీరు వస్తున్నాయన్నారు. ఆ అక్రమ కలెక్షన్లను తొలగించి ఆస్పరి మండలానికి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. మండలంలోని జొహరాపురం గ్రామ సమీపంలో ఎస్‌ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్ నుంచి పైపు లైన్ వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జొహరాపురం గ్రామస్తులు గత్యంతరం లేక కలుషిత నీరు తాగుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని 33 గ్రామాల్లో ఏ గ్రామానికి వెళ్లినా తాగడానికి గుక్కెడు నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. చుట్టుపక్కల కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల దగ్గరకు వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ఆలూరు నియోజకవర్గానికి తాగు, సాగునీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి ఏడాదయినా వేదవతి ప్రాజెక్టు ఊసే లేదన్నారు. తాగు నీరు లేక ఆస్పరి ప్రజల గొంతు ఎండుతుంటే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంటపాటు చేపట్టిన నిరసనకు కిలోమీటర్ పొడవు వాహనాలు నిలిచిపోయాయి. జడ్‌పిటిసి దొరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, యూత్ వింగ్ జిల్లా కార్యదర్శి ప్రకాష్, సొసైటీ మాజీ చైర్మన్ గోవర్దన్, నరసింహులు, మండల మాజీ కన్వీనర్లు రామాంజనేయులు, పెద్దయ్య, మాజీ సిఇఒ ఆశోక్, సర్పంచులు లింగప్ప, హరిశ్చంద్ర, వెంకటేష్, శ్రీను, ఎంపిటిసి రాఘవేంద్ర, సీనియర్ నాయకులు వెంకన్న, శివానంద, ప్రభాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాండు, నాయుడు, శివ, లక్ష్మన్న, తిమ్మప్ప, ప్రకాష్, ముని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా 'కూటమి' : టిడిపి

కౌతాళంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వమని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్, వెంకటపతి రాజు, చౌదరి బసవరాజు, సతీష్ నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక పింజర్ గేరిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందడంతో ప్రజలు ప్రభుత్వానికి నీరాజనాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. రామలింగ, రాజానందు, గిరి, ముకన్న, అమ్ము వలీ, కాకం రామాంజనేయులు పాల్గొన్నారు.

చిప్పగిరి : నిరుపేదలను లక్షాధికారిని చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని కర్నూలు సిటీ ఎన్నికల పరిశీలకులు, జడ్‌పిటిసిల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు ఏరూరు మీనాక్షి నాయుడు తెలిపారు. మండలంలోని ఏరూరు గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. చిప్పగిరి, ఏరూరు బ్రిడ్జి కూలడానికి సిద్ధంగా ఉండడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తుండగా, తాము కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక మరమ్మతుల కోసం జడ్‌పి నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపిటిసి నరసింహులు, టిడిపి నాయకులు మిరపకాయల చంద్ర, రామాంజి పాల్గొన్నారు.

చిప్పగిరిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం

- పెద్దహరివాణం సొసైటీ ఛైర్మన్ ఆదిశేషిరెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని, సొసైటీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని పెద్దహరివాణం ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఛైర్మన్ ఆదిశేషిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం, మదిరే గ్రామాల్లో సొసైటీ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారాలు జరిగాయి. పెద్దతుంబలం సొసైటీ ఛైర్మన్‌గా అన్వర్ బాష, డైరెక్టర్‌గా పాండవగల్లు బసన్న, జాలమంచి శరణప్ప, మదిరే సొసైటీ ఛైర్మన్ దామోదర్ చౌదరి, డైరెక్టర్‌గా ఇస్వి మగ్దుమ్ బాష, సంగి పోగుల లక్ష్మమ్మ, పెద్దహరివాణం డైరెక్టర్‌గా బాష, సంతేకుడ్లూరు గోవిందప్ప ప్రమాణ స్వీకారం చేశారు. వారు మాట్లాడుతూ... రైతులకు సకాలంలో రుణాలందించి వారి ఆర్థికాభివృద్ధి తోడ్పడతామని తెలిపారు. సొసైటీ ద్వారా రుణాలతో పాటు ఎరువులు అందిస్తామన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, బసాపురం రామస్వామి, ఆరెకల్ రామకృష్ణ, టిడిపి యువ నాయకులు భూపాల్ చౌదరి, మదిరే వీరేష్ పాల్గొన్నారు.


ఆదిశేషిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

'డప్పు' పింఛను ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించాలి

- ఎపి డికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

డప్పు కళాకారుల పింఛను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం గోనెగండ్లలో ఎపి డికెఎస్ మండల అధ్యక్షులు మారేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డప్పు కళాకారులకు డప్పు, గజ్జులు, డ్రెస్సు అందించాలని కోరారు. పింఛను దరఖాస్తు వయస్సు 45 ఏళ్లకు తగ్గించాలని, వారికి ఆరోగ్య భద్రత, రైలు, బస్సు ప్రయాణాల్లో రాయితీ, ఇంటి నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డప్పుల దరువులతో ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంపిడిఒ మణిమంజరికి వినతిపత్రం అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక

ఎపిడికెఎస్ మండల కమిటీని డప్పు కళాకారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఐరన్‌బండ మాణిక్యం, బోదెపాడు జాన్‌ను, ఉపాధ్యక్షులుగా పెద్దనేలటూరు దస్తగిరి, ఎర్రబాడు నాగరాజును, సహాయ కార్యదర్శులుగా గాజులదిన్నె పెద్దకర్రన్న, నెరుడుప్పల నాగార్జునను, కమిటీ సభ్యులుగా పెద్దనేలటూరు గోరంట్ల దస్తగిరి, గోనెగండ్ల చిన్న దేవన్న, ఎర్రబాడు రత్నమయ్య, గాజులదిన్నె ఏలియాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న డప్పు కళాకారులు

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన రైతు గువ్వల రంగస్వామి (39) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... రంగస్వామి తనకున్న 5 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. పురుగు మందు సేవించిన వెంటనే గ్రామస్తులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళు తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. సిఐ విశ్వనాథను ప్రశ్నించగా మృతుని భార్య ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎంఇగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆదోని

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎంఇ సత్యనారాయణ

ఆదోని మున్సిపల్ ఇంజినీర్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పెండింగ్ పనులు పూర్తి చేయించి సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇక్కడ మున్సిపల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఇంతియాజ్ గుంతకల్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జిగా డిప్యూటీ ఇంజినీర్ చలపతి రెడ్డి బాధ్యతలు తీసుకోగా రెగ్యులర్ మున్సిపల్ ఇంజినీర్‌గా తనను ప్రభుత్వం నియమించిందని తెలిపారు.

హుండీ ఆదాయం రూ.1.12 కోట్లు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.1,12,02,820 వచ్చిందని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. గురువారం 75 రోజుల హుండీ లెక్కింపును కర్నూలు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చేపట్టారు. భక్తులు స్వామివారికి నగదుతోపాటు బంగారం 68 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 13 కిలోల 720 గ్రాములు సమర్పించుకున్నారు. దేవాలయ సూపరింటెండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అందుబాటులోకి మురుగుదొడ్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆధునికీకరణతో అందుబాటులోకి వచ్చిన మురుగుదొడ్లను ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు గురువారం ప్రారంభించారు. స్థానిక బస్టాండ్‌కు చేరుకున్న ఆయన సిబ్బందితో కలిసి రిబ్బన్ కట్ చేసి భక్తులకు, ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. మహిళలు, పురుషులకు బాత్ రూమ్స్‌తో పాటు యూరినల్స్ మురుగుదొడ్లు మొత్తం 13 ఉన్నట్లు డిఎం మద్దిలేటి నాయుడును తెలిపారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ దస్తగిరి పాల్గొన్నారు.

భారీ క్యూలైన్ ఏర్పాటుకు సన్నాహాలు

- శ్రీమఠం ఎదురుగా భారీ నిర్మాణంతో హాలు
- జర్మనీ తరహా షెడ్లు, హాలు నిర్మాణం ఉండాలన్న పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతుండంతో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్‌తో కలిసి క్యూలైన్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలో కాంట్రాక్టర్‌కు చూపించారు. శ్రీమఠం ముఖ ద్వారం వద్ద ఉన్న శ్రీమధ్వ మార్గ కారిడారులో 10 అడుగుల వెడల్పుతో సుమారు ఐదుగురు భక్తులు నడిచే విధంగా ఎండ, వాన నుంచి రక్షణ కల్పించే విధంగా ప్రధాన ఆర్చి వరకు జర్మనీ తరహాలో ఏర్పాటు చేయాలని సూచించారు. మళ్లీ ప్రధాన ఆర్చి నుంచి బృందావన గార్డెన్ అతిథి గృహానికి వెళ్లే రహదారి వరకు 4 అడుగుల వెడల్పుతో ఇద్దరు భక్తులు నడిచే విధంగా క్యూలైన్ ఉండాలని తెలిపారు. శ్రీమఠం ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ చివరలో సుమారు 5 వేల మంది భక్తులు సేదతీరే విధంగా జర్మనీ తరహా భారీ షెడ్‌తో డార్మెటరీ హాలు ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు, 6 మురుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పరిమళ ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద కూడా భక్తుల ఇబ్బందులను గమనించిన పీఠాధిపతులు శ్రీమఠం పరిపాలనా కార్యాలయం వద్ద అదనంగా విక్రయ కేంద్రాల నిర్మాణానికి ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన పీఠాధిపతులు

శ్రీమఠం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పరిశీలించారు. బృందావన గార్డెన్ అతిథి గృహం ఎదురుగా నిర్మిస్తున్న పుష్కరిణి పనులను పరిశీలించారు. ఆగస్టు 8 నుంచి 14 వరకు జరగనున్న శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలకు ప్రారంభించేందుకు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడే నిర్మిస్తున్న డార్మెటరీ హాలును చూసి పలు సూచనలు చేశారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, ద్వారపాలక అనంతస్వామి మురళీ, కాంట్రాక్టర్ ఓబులయ్య ఉన్నారు.

పరిశీలిస్తున్న పీఠాధిపతులు

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న నిర్వాహకులు

పట్టణంలో ఈనెల 20న రక్తనాళాల కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న ట్లు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కాకు బాళ్ నాగేష్ తెలిపారు. గురువారం వారి కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్), వామ్ (ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ) సంయుక్త ఆధ్వర్యంలో ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ (హైదరాబాద్), శాంతిరాం ఆస్పత్రి (నంద్యాల), ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆవోపా, వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ... ఈ శిబిరంలో అర్హులైన వారికి రూ.4,500 విలువ గల రక్తనాళాల పరీక్షలు, కన్సల్టింగ్ సర్వీసులు, డాక్టర్ల సలహా మేరకు ఉచిత కంటి శుక్లం ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలోనే వసతి, భోజనం, మందులు, రానుపోను రవాణా సౌకర్యం నిర్వాహకులు కాకుబాళ్ నగేష్ కల్పిస్తారని తెలిపారు. ఈనెల 20న పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ 3వ రోడ్డులో గల సంస్కృతి ఫంక్షన్ హాలులో, (వైట్ హౌస్ పక్కన, అయ్యప్ప స్వామి గుడి దగ్గర) శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 73373 21810 (రక్తనాళాల క్యాంప్), 9980269662 (కంటి క్యాంపు) నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఇంటి స్థలం పట్టా మార్పు..

- చర్యలు తీసుకోవాలి : బాధితురాలు సుజాత

ప్రజాశక్తి - దేవనకొండ

వినతిపత్రం అందిస్తున్న సుజాత

మండలంలోని తెర్నేకల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటి స్థలం పట్టా మార్పు చేసిన సుశీలమ్మపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితురాలు సుజాత కోరారు. గురువారం తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 1995వ సంవత్సరంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో 363 సర్వే నెంబర్‌లోని 461 ప్లాట్‌లో 3 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ అధికారులు తనకు పట్టా ఇచ్చి కేటాయించారని తెలిపారు. మూడేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఇమ్మానియేల్, ఆయన అక్క సుశీలమ్మ పేరిట గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులతో ఇంటి స్థలం పట్టాను మార్పు చేశారని విమర్శించారు. తాను ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకొని చాలా ఏళ్ల నుంచి జీవనం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదోని పట్టణానికి చెందిన సుశీలమ్మకు తన ఇంటి స్థలం పట్టాను ఎలా మార్పు చేశారో రెవెన్యూ అధికారులకే తెలుసని, ఆ పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తహశీల్దార్ రామాంజనేయులు ప్రశ్నించగా... ఇరువురిని విచారించి రెవెన్యూ రికార్డు పరంగా ఎవరికి ఇంటి స్థలం పట్టాను ఇచ్చారో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

'సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఇస్మాయిల్, జి.నాగరాజు, బి.కేశన్న, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా 17 రోజుల పాటు సమ్మె చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న డిమాండ్లను అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులు కె.రాజా, మత్ బీ, మునీంద్ర, నరసోజి, ఎస్.వీరేష్, మల్లికార్జున, మహేంద్ర, మాబీ, సీను, యు.లక్ష్మన్న, రంగన్న, చిదానంద, నరేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న కార్మికులు

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- ప్రిన్సిపల్ రాఘవరావు

ప్రజాశక్తి- ఆలూరు

కళాశాలలో ప్రతి విద్యార్థీ వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు తెలిపారు. గురువారం ఆలూరు ఆదర్శ పాఠశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, రోల్ ప్లే, మై ట్రేడ్ మై డ్రీమ్ పేరుతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఐటి ట్రేడ్ రిలేటెడ్ స్పీచ్ అందరిని ఆకట్టుకున్నాయి. స్టడీ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఐటి ఒకేషనల్ అధ్యాపకులు ప్రకాష్, ఆటోమోటివ్ ఒకేషనల్ అధ్యాపకులు శివలు గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, మెమెంటో, పార్టిసిపేట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధ్యాపకులు వివిఎం.వీరేష్, మంజుల, కల్పన, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్

ముఖ్యమంత్రి బాబును కలిసిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నంద్యాల జిల్లా మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొనడానికి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి కలిశారు. ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రి బాబుతో ఎమ్మెల్యే బీవీ

ఆదోని : ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికామని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ.. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకి దక్కిందని తెలిపారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ బీటీ

దేవనకొండ : రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ కోరారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవా కాలువల నీటి విడుదలకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపిపి కప్పట్రాళ్ల రామచంద్ర నాయుడు మాట్లాడారు. మండలంలో అధ్వానస్థితికి చేరుకున్న పి.కోటకొండ క్రాస్ రోడ్డు నుంచి బేతపల్లి రోడ్డు, కప్పట్రాళ్ల క్రాస్ రోడ్డు నుంచి గాజులదిన్నె ప్రాజెక్టు రోడ్ల పరిస్థితిని వివరించి, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

వినతి పత్రం ఇస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

మంత్రాలయం : గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ... గతేడాది గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ బసలదొడ్డి ఫేజ్ 1, 2లో గుర్తుతెలియని దుండగులు నాశనం చేయడం వల్ల ప్రాజెక్ట్ ద్వారా నీటి సరఫరా ఆగిపోయిందని తెలిపారు. సామగ్రికి మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. త్వరలోనే సామగ్రిని బాగు చేయించే బాధ్యత తీసుకుంటామని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మహారాజశ్రీ గౌరవనీయులైన 3 వ ఆదనపు జిల్లా జడ్జి కం మోటార్ వెహికల్స్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ :: నంద్యాల

MVOP NO.26/2022

గాండ్ల శివరామయ్య. ...పిటిషనర్

V/S

1. పూల సుబ్బయ్య
2. M/s ఒరియంటల్ ఇన్సూరెన్స్ co. Ltd
3. రామరాజు. ...ప్రతివాదులు

1వ ప్రతివాది.

ఎస్.వి.పూల సుబ్బయ్య, S/o. ఎస్. దుర్గన్న, హిందూ, మేజర్, చావేర్లెట్ ఎంజాయ్ కార్, బేరింగ్ నెం. %ూ 21 AU 5651, R/o H. నెం. 79-14-B4, ZP కాలనీ, కృష్ణ నగర్, కర్నూలు పట్టణం & జిల్లా.

1వ ప్రతివాదికి నోటీసు

పైన కనబర్చిన MVOP లో అర్జీదారులు, పై కోర్టు లో నష్ట పరిహారం కోసం దాఖలు చేసిన పై నెంబర్ అర్జీ నందు 1వ రెస్పాడెంట్ అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసు పంపించినను మీకు ముట్టనందున కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు నందు 31/07/2025 వ తేదిన మీరు గాని మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేని ఓయెడల, మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తరువుల మేరకు)

వాయిదా తేదీ : 31/07/2025

ఇట్లు
S. రాజగోపాల్ రెడ్డి ,
V. బాలునాయక్
పిటిషనర్స్ తరపు న్యాయవాదులు,
నంద్యాల.